సమన్వయం

ఏదైనా ఒక సంస్థ మొలకగా ఉన్నప్పుడు - ఆ సంస్థని నడిపించడానికి కేవలం ఒక అధికారి మాత్రమే సరిపోతాడు - సదరు సంస్థ శాఖోపశాఖలుగా విస్తరించినపుడు, తదనుగుణంగా అధికారుల సంఖ్య కూడా పెంచవలసి వస్తుంది ! అధికారుల సంఖ్య పెంచకుండా సంస్థని విస్తరించుకుంటూ పోతే, ఆ 'ఏకైక అధికారి' మీద పని ఒత్తిడి అధికమై - చేసేపనిలో అలసత్వం, మొక్కుబడితనం చోటుచేసుకుంటాయన్న సంగతి 'పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' పట్టభద్రులందరికీ తెలిసిన విషయమే!

అయితే -

ఏ సంస్థలోనైనా ప్రారంభదశలో - కేవలం ఒక వ్యక్తి మాత్రమే అన్ని వ్యవహారాలనూ చక్కదిద్దుకోగల్గినప్పటికీ - ఆ తర్వాత్తర్వాత రోజుల్లో పరిపాలనా సౌలభ్యం కోసం - శ్రమ' విభజన, అధికార వికేంద్రీకరణ అవసరమై - మేనేజర్, సబ్ మేనేజర్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్, సూపరింటెండెంట్, అకౌంటెంట్ తదితర కొత్తపోస్టులు సృష్టించబడతాయి! ఒక్కోపనికి ఒక్కో అధికారి జవాబుదారీయై- అందరూ కలిసి ఆ సంస్థ బాగోగులకి 'సమిష్టి బాధ్యత' వహించాల్సిన అవసరం ఏర్పడ్తుంది !

అయితే ఇలాంటి సందర్భాల్లో ఆది నుండీ సంస్థని అంటిపెట్టుకుని అన్నాళ్ళూ ఏకచత్రాధిపత్యం వహించిన సీనియర్ అధికారులకి - జూనియర్ అధికారుల 'రాక' మింగుడుపడక; జూనియర్ అధికార్లకి - సీనియర్ల 'ఉనికి' కొరుకుడుపడక - ఆయా అధికారుల మధ్య సమన్వయం లోపించి- అభివృద్ధి కుంటుపడటం కొన్ని సంస్థలలో చూస్తూఉంటాం!

సీనియర్లు జూనియర్ల ఉత్సాహపు పొంగు మీద నీళ్ళు చిలకరించే ప్రయత్నం చేసినా- జూనియర్లు సీనియర్ల సలహాలని పెడచెవిన పెట్టాలని చూసినా... అదంతా చివరకు చిలికి చిలికి గాలివానై సదరు అధికారుల మధ్య 'కోల్డ్‌వార్'కి దారి తీస్తుంది.

"నువ్వేంటి నాకు చెప్పేది ? నువ్వేమైనా నాకు సుపీరియర్‌వా ? ఈ సంస్థలో నువ్వెంతో నేనూ అంతే ! వియారీక్వల్స్!" అని జూనియర్లు సీనియర్ల పెద్దరికాన్ని తుంగలో తొక్కి గఁయ్ గఁయ్‌మని అరిచినప్పుడు....

"ఏదో పెద్దవాణ్ణి కదా అని సలహాలివ్వబోతే గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్టు... 'ఇట్స్‌నన్నఫ్ యువర్ బిజినెస్!' అంటాడా - ఆప్టరాల్ నా జూనియర్ - అడ్మినిస్ట్రేషన్‌లో ఏబీసీడీలు తెలీనివాడు?" అని సీనియర్లు జూనియర్ల దుందుడుకుతనానికి ఒంటికాలి మీద లేచినప్పుడు.....

సంస్థలో అనారోగ్యకరమైన వాతావరణం చోటుచేసుకుని ఊపిరాడనట్టుగా ఉంటుంది!

సంయమనం కోల్పోయి అనుచితంగా ప్రవర్తించే అధికారులకి ముక్కుతాడేసి - నోళ్ళు మూయించి - సక్రమ పద్ధతిలో నడిపే 'సమన్వయకర్త' లేకపోతే - సంస్థలోని అధికారులదీ, ఉద్యోగులదీ తలోదారై అడ్మినిస్ట్రేషన్‌లో ప్రతిష్టంభన ఏర్పడ్తుంది!

ఎవరెంత రెచ్చగొట్టినా రెచ్చిపోకపోవడం: సంయమనం!

రెచ్చిపోయిన వాళ్ళందర్నీ అదుపులో పెట్టడం: సమన్వయం !

మొదటిది ఉదాత్త లక్షణమైతే- రెండోది నాయకత్వ లక్షణం ! ఈ రెండు లక్షణాలూ పుణికి పుచ్చుకున్నవాడు - 'గొప్ప పరిపాలనా దక్షుడు' అనిపించుకుంటాడు!

16-8-1996